
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, ఆదివారం 1 డిసెంబర్ 2024 HYDERABAD

## హైడ్రా పైగా ప్యాలెస్‌కు..

### ఈ నెలలో ఆఫీసును తరలించే ప్రయత్నం..త్వరలోనే హైడ్రా పీఎస్

సిటీబ్యూరో: బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయం మరో ప్రాంతానికి మారనున్నది. బేగంపేటలోని పైగా ప్యాలెస్‌ను హైడ్రాకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. డిసెంబర్ నెలాఖరులోగా కార్యాలయాన్ని మార్చడానికి హైడ్రా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసుకున్న హైడ్రాను ఇప్పుడు బేగంపేటకు మారుస్తుండడం, ఓఆర్ఆర్ లోపల చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్న హైడ్రా కార్యాలయం కూడా చెరువు హద్దుల్లోనే ఉందని మరి దీన్ని ఎలా చూడాలంటూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం హైడ్రాను మరోచోటికి మార్చడానికి నిర్ణయం తీసుకుంది. ఇక త్వరలోనే హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాలయానికి ప్రతి రోజూ 30 నుంచి 40 ఫిర్యాదులొస్తున్నాయని సమాచారం. వీటిని పరిశీలించడమే పెద్ద పని కాగా.. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడం మరింత తలనొప్పిగా ఉంటుందని అధికారులు అంటున్నారు.




పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

అరచేతిలో వైకుంఠం

# వాస్తవికతకు దూరంగా బడ్జెట్

## ఆదాయ మార్గాలపై నిర్లక్ష్యమేలా?

బడ్జెట్ సంక్షిప్త స్వరూపం (రూ.కోట్లలో)




### 2025-26 ముసాయిదా బడ్జెట్‌పై మేయర్‌తో సహా సభ్యుల అభ్యంతరం

### బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటన

### డిసెంబర్ 9 తర్వాత సమగ్ర వివరాలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశాలు

సిటీబ్యూరో, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ 2025-26 ముసాయిదా బడ్జెట్ వాయిదా పడింది. వచ్చే నెల 9 తేదీ తర్వాత మరోసారి సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదన స్టాండింగ్ కమిటీ సభ్యుల ముందు చర్చకు రానున్నది. రూ. 8,340 కోట్లతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలు శనివారం మేయర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఫైనాన్స్ విభాగం అదనపు కమిషనర్ వివరించారు. గ్రేటర్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులు, నిర్వహణ , గత ఏడాది కంటే పెరిగిన సవరణ బడ్జెట్‌పై వివరించారు. అయితే ఆదాయ మార్గాలను తక్కువ చూపడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గడిచిన మూడేండ్లలో ఆదాయ రాబడిలో అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రకటన విభాగం, ఎస్టేట్ విభాగం, ఆస్తిపన్ను, టౌన్ ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్‌లలో లోపాలను ఎత్తి చూపారు. ముఖ్యంగా ఆస్తి పన్ను వసూళ్లను ప్రతి ఏటా నామమాత్రంగానే పెంచుకుంటూపోతుండడం, ఆస్తిపన్ను చెల్లింపుల్లో పారదర్శకత లోపించింది. ప్రతి ఏటా ఆశించిన స్థాయిలో ట్యాక్స్ కలెక్షన్లు పెరగడం లేదు. దాదాపు ఏటా రూ. 2500 కోట్ల మేర ఆదాయం రావాల్సి ఉండగా, రూ. 1900 కోట్ల వరకు మాత్రమే వస్తున్నది. 2023-24లో రూ.1923.83 కోట్లు, 2024-25లో రూ.1907 కోట్లు అంచనాలు రూపొందించగా, 2025-26లో 2005 కోట్లుగా అంచనాలు వేశారు. ట్యాక్స్‌ను పెంచుకునేందుకు రూ. 22 కోట్లతో జీఐఎస్ సర్వే మొదలు పెట్టిన ఈ విధానంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.

#### ఎస్టేట్ ఆదాయం పక్కదారి

జీహెచ్‌ఎంసీలో ఎస్టేట్ విభాగం పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయిందని అనడానికి తగ్గిన ఆదాయమే నిదర్శనంగా చెప్పొచ్చు. సొంత ఆస్తుల విభాగమైన ఎస్టేట్‌లో గడిచిన రెండేండ్లలో ఆదాయం భారీగానే పడిపోయింది. 2023-24లో రూ.19.47కోట్లు వసూలు కాగా 2024-25లో రూ.17కోట్లను ప్రతిపాదించారు. గత సెప్టెంబర్ నాటికి కేవలం రూ. 5.47 కోట్లు మాత్రమే వసూలు చేశారు. దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమే..గడువు ముగుస్తున్నా ఏండ్ల తరబడి లీజును రద్దు చేయడం లేదు. ఇందుకు కోఠిలో మోతీ మార్కెట్‌లో దశాబ్దాలకు పైబడి షాపుల లీజుల గడువు ముగిసినా నేటికి కొనసాగుతున్నాయి. గడువు ముగిసిన దుకాణాదారులను ఖాళీ చేయించలేక, కొత్తగా టెండర్లు పిలిచి పారదర్శకంగా నిర్వహణ చేపట్టి ఆదాయం పెంచాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 2025-26 సంవత్సర బడ్జెట్‌లో ఎస్టేట్ ఆదాయాన్ని రూ.18.19 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. గడిచిన రెండేండ్లలో ఎస్టేట్ ఆదాయాన్ని పరిశీలిస్తే ఎస్టేట్ ఆదాయం రూ. కోటి తక్కువగానే ప్రతిపాదించడంపై ఆదాయాన్ని సక్రమంగా వసూలు చేయడం లేదన్న విషయం తేలిపోయింది.

#### ట్రేడ్ లైసెన్స్‌లపై పట్టింపేదీ?

జీహెచ్‌ఎంసీ ఆదాయ మార్గాల్లో కీలకమైనది ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, రెన్యువల్. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రతిపాదనలకు, కలెక్షన్లకు ఎక్కడా పొంతన ఉండటం లేదు. 2024-25లో రూ.110 కోట్లు ప్రతిపాదించగా, గత సెప్టెంబర్ నాటికి రూ. 15.27కోట్లు వసూలయ్యాయి. దీని బట్టి చూస్తే ట్రేడ్ లైసెన్స్ ఆదాయాన్ని పట్టించుకోవడం లేదని బడ్జెట్ లెక్కల్లో స్పష్టం చేస్తున్నది. ఈ క్రమంలోనే ఈ సారి (2025-26)కు రూ. 92 కోట్లు ప్రతిపాదించారు.




**కేటాయింపులు ఇలా (రూ. కోట్లలో)**

హెచ్-సిటీ రూ.2,242
సమగ్ర వ్యర్థాల నిర్వహణకు రూ.703
హెల్త్ అండ్ శానిటేషన్ రూ. 600
వీధి దీపాలు రూ. 344 .. రవాణా విభాగం రూ.105
పార్కులు రూ. 222.. ఇంకుడు గుంతలు రూ. 72
చెరువులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ రూ. 173

#### పూర్తి వివరాలను వచ్చే సమావేశంలో వివరిస్తాం

- కమిషనర్ ఇలంబర్తి

ఆదాయ వనరులు పెంచుకున్నప్పుడు జీహెచ్‌ఎంసీలో అభివృద్ధి పనులు కొనసాగుతాయని కమిషనర్ ఇలంబర్తి అన్నారు. జీఐఎస్ సర్వే జోన్ వారీగా పూర్తయిందని, దాని ప్రకారం 24 లక్షలు గృహాలు ఉన్నాయని తెలిపారు. 1.25 ఇండ్ల సర్వే పూర్తి చేశామని, సర్వేయర్లను ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పుడే తొందరగా ఫిజికల్ సర్వే పూర్తవుతుందని, ఆ దిశగా ముందుకు పోతున్న నేపథ్యంలో పూర్తి వివరాలు వచ్చే సమావేశంలో వివరిస్తామని కమిషనర్ సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, అడిషనల్ కమిషనర్లు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

#### ప్రకటన విభాగంలో అక్రమాలు

జీహెచ్‌ఎంసీ బ్రాండ్ ఇమేజీకి తగిన విధంగా కొత్త అడ్వర్టయిజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని, ఆదాయం పెంచుతామని గొప్పలు చెప్పిన జీహెచ్‌ఎంసీ క్షేత్రస్థాయిలో కొన్ని ఏజెన్సీలకు కొందరు అధికారులు కొమ్ముకాస్తూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. దాదాపు రూ. 100 కోట్ల మేర ఆదాయం రావాల్సిన చోట సగం మేర వసూలు అవుతూ మిగతా వాటిని పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. 2023-24లో రూ. 46.48 కోట్లు, 2024-25కు సంబంధించి రూ.8.16 కోట్లు మాత్రమే వసూలు చేయడం గమనార్హం. ఈ విభాగం ఆదాయం 2025-26లో రూ. 20.45 కోట్లుగా ప్రతిపాదించారు.

#### బడ్జెట్ రియలిస్టిక్‌గా లేదు..

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రివైజ్డ్ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌పై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఫైనాన్స్ అడిషనల్ కమిషనర్ గీతా రాధిక వివరణ ఇచ్చారు. పలు అంశాలపై స్టాండింగ్ కమిటీ సభ్యులు 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించి పలు అంశాల్లో బడ్జెట్ ప్రతిపాదనలు (వాస్తవికంగా) రియలిస్టిక్‌గా లేవని , ఎస్టేట్, అడ్వర్టయిజ్‌మెంట్ బడ్జెట్ ఆదాయం తక్కువ చూపించారని సభ్యులు ఆరోపించారు. వారి సూచనలు పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ప్రతిపాదనలో మార్పులు చేసి తిరిగి సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతిపాదనల ఆమోదం వాయిదా పడింది. వచ్చే వారంలో సమావేశం నిర్వహించి ఆమోదం పొందనున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బడ్జెట్ సమావేశం తిరిగి ఈ నెల 9 తర్వాత నిర్వహిస్తామన్నారు.

#### ఆదాయం పెంచేలా బడ్జెట్ ఉండాలి: మేయర్

2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్‌ఎంసీ బడ్జెట్ ప్రతిపాదనలలో వృథా ఖర్చులను తగ్గించి ఆదాయం పెంచేలా బడ్జెట్‌ను రూపొందించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. బడ్జెట్ ముసాయిదా ప్రతిపాదనలు సకాలంలో అధికారులు అందించకపోవడం మూలంగా స్టడీ చేయలేకపోయామని సభ్యులు ఆరోపించారన్నారు. రూపొందించిన ముసాయిదా బడ్జెట్ ప్రతిపాదనలు కూడా కొన్ని అంశాలు రియలిస్టిక్‌గా లేనందున వాయిదా వేయాలని సభ్యులు కోరడంతో వాయిదా వేసినట్లు మేయర్ పేర్కొన్నారు.

#### అంకెల గారడి: స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆవుల రవీందర్‌రెడ్డి

ముసాయిదా బడ్జెట్ అంత అంకెల గారడీగా ఉంది. ఆదాయ మార్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అధికారుల పనితీరు ఏ మాత్రం సరిగా లేదు. ఆస్తిపన్ను వసూళ్లలో అక్రమాలు జరుగుతున్న పట్టడం లేదు. ప్రతి ఏటా ట్యాక్స్ కలెక్షన్లను నామమాత్రంగా పెంచుతూ వస్తున్నారు. గతంతో పోలిస్తే టౌన్‌ప్లానింగ్ ఆదాయాన్ని భారీగా తగ్గించారు. ఎస్టేట్ విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది.

## నిధుల రద్దుతో ఆగిన అభివృద్ధి

### పెండింగ్ పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలి

### మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి వినతి

బడంగ్‌పేట, నవంబర్ 30: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.69 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపనలు చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనులను నిలిపివేశారని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మంత్రి శ్రీధర్ దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గవ్యాప్తంగా మధ్యంతరంగా ఆగిపోయిన పనుల వివరాలను వివరిస్తూ.. వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రద్దు చేయడం వల్ల మధ్యంతరంగా పనులు ఆగిపోయాయని ఆమె తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా నిధులు మంజూరు చేయించాలన్నారు. చాలా చోట్ల బస్తీ దవాఖానలు, సమీకృత మార్కెట్ల పనులు నిలిపివేశారని తెలిపారు. గత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పనిచేసిందని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు సూర్ణ గంటి అర్జున్, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, బండారు మనోహర్, ఎర్ర మహేశ్వరి జైయిం తదితరులు పాల్గొన్నారు.




**• దీక్షా దివస్ సక్సెస్.. బీఆర్‌ఎస్‌లో జోష్**

మేడ్చల్ : మేడ్చల్ జిల్లాలో శుక్రవారం జరిగిన దీక్షా దివస్ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షా దివస్‌కు జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల నుంచి వేలాది సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు.

## రూ.20 కోట్లతో బేగంపేట ఆర్‌వోబీకి మరమ్మతులు

సిటీబ్యూరో, నవంబర్ 30 ( నమస్తే తెలంగాణ): రూ. 20 కోట్లతో బేగంపేట ఆర్‌వోబీ(రైల్ ఓవర్ బ్రిడ్జి)కి మరమ్మతులు చేపట్టేందుకు అనుమతి ఇస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా బల్దియాను ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ మొదటి దశ పనుల్లో భాగంగా రూ. 2.99 కోట్లతో చేపట్టిన సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి పనులకు సంబంధించి అలుగు నిర్మాణం, ఇతర మరమ్మతు పనులకు అనుమతినిచ్చారు. అలాగే ప్రకటనల రుసుము నుంచి మినహాయింపునిస్తూ.. రెండు సంస్థలకు వేర్వేరు ప్రాంతాల్లో ఎల్ఈడీ బోర్డులను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. బేగంపేట విమానాశ్రయం రోడ్డుపై భారత వాతావరణ శాఖకు, రవీంద్రభారతిలో రాష్ట్ర, భాషా, సాంస్కృతిక శాఖలు డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.




రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

## నేరేడ్‌మెట్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ప్రయాణికుల సౌకర్యం కోసం నేరేడ్‌మెట్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీని నిర్మించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఎర్రమంజిల్‌లోని చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో నేరేడ్‌మెట్ వద్ద ఆర్‌యూబీని నిర్మించాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మధుసూదన్‌రెడ్డికి ఎమ్మెల్యే, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2014 డిసెంబర్ 3న రూ.32.5 కోట్లతో ఆర్‌యూబీ నిర్మించడానికి శంకుస్థాపన చేశారని, పదేండ్లు అయినా పనులు మొదలు కాలేదన్నారు. తరచూ గూడ్స్ రైళ్లు, ఎంఎంటీఎస్ రెండో దశలో లోకల్ రైళ్లు నడుస్తుండడంతో తరచూ నేరేడ్‌మెట్ రైల్వే గేటు మూసి వేస్తున్నారన్నారు. ప్రతి 20 నిమిషాలకు గేటు మూయడంతో ద్విచక్ర వాహనాలు, బస్సులు, కార్లు, లోకల్ లారీలు నిలిచి ట్రాఫిక్ జామ్ అవుతున్నదన్నారు. ఉద్యోగులు సమయానికి వెళ్లలేక వారి ఉద్యోగాలు ఊడుతున్నాయని చెప్పారు. ఇప్పటికే దాదాపుగా రైల్వే శాఖ ఆర్‌యూబీ నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. రోడ్లకు సంబంధించిన విస్తరణతో పాటు ఇతర సాంకేతిక పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కోరారు. బద్దం పరశురాంరెడ్డి, మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్‌కు వర్ష సూచన



సిటీబ్యూరో, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా గత రెండు రోజులుగా నగరంలో రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 28.7, రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల నుంచి 20.8 డిగ్రీలకు పెరిగాయి. దీంతో రాత్రి సమయంలో చలి తీవ్రత కొంత తగ్గుముఖం పట్టింది.

# చర్యలు తీసుకునేనా?

## కలెక్టర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల మొర.. డీఎస్సీ టీచర్ల భర్తీలో నిర్లక్ష్యం

#### ఇష్టానుసారంగా టీచర్ల కేటాయింపు

సిటీబ్యూరో, నవంబర్ 30 ( నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో ఇటీవల డీఎస్సీ టీచర్ల భర్తీలో కొందరి అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న దగ్గర ఉపాధ్యాయులను కేటాయించకపోవడం.. అవసరం లేని చోట టీచర్లను కేటాయించడం చేశారు. పాఠశాలలో ఉన్న ఖాళీలను అధికారులు చూపించకపోవడంతో ఇష్టానుసారంగా భర్తీ ప్రక్రియ ముగించారు. అయితే ఈ నిర్లక్ష్యంపై 'నమస్తే'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌తో విచారణ చేయించారు. విచారణలో బాధ్యులైన సదరు డిప్యూటీ ఐఓఎస్‌ల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం ఉందని కలెక్టర్‌కు నివేదిక అందించారు. అయితే దీనిపై బాధ్యులైన సదరు డిప్యూటీ ఐఓఎస్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఆదేశాలు ఇచ్చారు. చర్యలు తీసుకునేందుకు డీఈఓ వారి నుంచి వివరణ కోరనున్నారు. అనంతరం కలెక్టర్ ఆ వివరణ ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు. ఇప్పుడు ఈ టాపిక్ జిల్లా విద్యా శాఖలో కలకలం రేపుతున్నది. బాధ్యులైన డిప్యూటీ ఐఓఎస్‌లు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసుకుని తమ గోడును వెల్లబోసుకున్నట్టు తెలిసింది. అదనపు భారంతో సతమతమవుతున్నామని చెప్పినట్టు తెలిసింది. తమపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మద్దతుగా నిలవాలని సంఘాలకు విన్నవించుకున్నారు. అయితే ఈ వ్యవహారంపై కలెక్టర్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. కాగా, హైదరాబాద్‌లో డీఎస్సీ 2024లో 584 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు. 878 పోస్టులకు గాను కోర్టు కేసులు, రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో 262 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా 616 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్‌తో 32 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు నిలిపివేసిన విషయం తెలిసిందే. నియామక పత్రాలు అందుకున్న వారిలో 386 ఎస్జీటీ, 107 ఎస్ఏ, 91 ఎల్పీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు లభించాయి.

## ఓటీఎస్ అట్టర్ ఫ్లాప్

### ముగిసిన గడువు..రెండు నెలల సమయం ఇచ్చినా ఫలితమివ్వని వైనం


### రూ.1255కోట్ల లక్ష్యం. వచ్చింది రూ.110కోట్లే

సిటీబ్యూరో: దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లా బిల్లులను వసూలు చేసేందుకు జలమండలి అందుబాటులోకి తెచ్చిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. రెండు నెలల పాటు ప్రభుత్వం అవకాశం ఇవ్వగా..శనివారంతో ఈ గడువు ముగిసింది. కేవలం దాదాపు లక్షకు పైగా ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోగా, జలమండలి కేవలం రూ.110 కోట్లు మాత్రమే ఆదాయాన్ని సమకూర్చుకున్నది. వాస్తవంగా డొమెస్టిక్, డొమెస్టిక్ స్లమ్, కమర్షియల్, ఇండస్ట్రియల్, ఎంఎస్‌బీ, బల్క్, కాలనీలు, ప్రభుత్వ, కేంద్ర రంగ సంస్థలు కలిపి 7.18 లక్షల కనెక్షన్లకు ఓటీఎస్ వర్తింపు కాగా.. వీటి నుంచి రూ. 1961 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని జలమండలి అంచనా వేసింది. ఇందులో రూ.705 కోట్ల మేర వడ్డీ మాఫీ కానున్నది. రూ. 1255 కోట్ల మేర బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా ఓటీఎస్‌ను డివిజన్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టినా.. ఫలితం లేదు..దీనికి కారణాలు లేకపోలేదు.ఓటీఎస్ జీవో వెలువడిన తర్వాతనే జలమండలి విధి విధానాలు రూపొందించి దాదాపు 17 రోజుల పాటు సమయం తీసుకున్నది. దీనికితోడు దసరా, దీపావళి జంట పండగలు వచ్చాయి. 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఎక్కువ శాతం సిబ్బంది సమయం కేటాయించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కరువైంది. అన్నింటికంటే ముందు ఆఫిడవిట్, సెల్ఫ్ డిక్లరేషన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. గతంలో దాదాపు ఓటీఎస్ రూపంలో రూ. 250కోట్లకు పైగా ఉంటే ఈ సారి మాత్రం జలమండలి రూ.110కోట్లకే సరిపెట్టుకున్నది. కాగా ఓటీఎస్ సద్వినియోగం చేసుకోని వారి నల్లా కనెక్షన్లను తొలగిస్తామని జలమండలి హెచ్చరికలు జారీ చేస్తుండడంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

### ఇంటర్ విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

## అధ్యాపకుడిపై కేసు

మియాపూర్: సీనియర్ ఇంటర్ విద్యార్థినితో ఓ అధ్యాపకుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మదీనాగూడలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో కెమెస్ట్రి అధ్యాపకుడిగా పని చేస్తున్న హరీశ్ సీనియర్ ఇంటర్ విద్యార్థిని పట్ల కొద్ది కాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని అసభ్యకరమైన మెసేజ్‌లను పంపుతున్నాడు. అతడి ప్రవర్తనతో విసుగు చెందిన బాధితురాలు తల్లిదండ్రులకు విషయాన్ని తెలిపింది. వారు కళాశాలకు చేరుకుని అధ్యాపకుడు హరీశ్ చేష్టలపై కళాశాల ప్రిన్సిపాల్ ఇతర సిబ్బందిని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కళాశాలకు చేరుకొని అధ్యాపకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగాయి. ఎస్ఐ వెంకట్ కళాశాలకు చేరుకుని విద్యార్థినిలు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సదరు అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్ తెలిపారు. సదరు అధ్యాపకుడి అసభ్య ప్రవర్తన నిర్ధరణ కావడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు కళాశాల ప్రతినిధి నాగరాజు పేర్కొన్నారు.



అధ్యాపకుడు హరీశ్